క్లుప్తంగా

పోటాపోటీగా ప్రచారాలు

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల సూర్యలత కాటన్‌మిల్లు వద్ద ఇరువర్గాల నాయకులు పోటాపోటీగా ప్రచారం చేపట్టారు. అక్టోబర్ 1న పోలింగ్ ఉండడంతో కార్మికులను ప్రసన్నం చేసుకునేందుకు పోటీలో ఉన్న సూర్యప్రకాశ్‌రావు, ఆనంద్‌కుమార్‌లు తమదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్మికులకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇస్తున్నారు.

మద్దతు ధర కల్పించాలి

తెలకపల్లి: పత్తికి మద్దతు ధర కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు గోపస్ లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి పంట పూర్తిగా నీటిలో మునిగిందని బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. అదేవిధంగా పత్తి తేమ శాతం అధికంగా ఉండటంతో మిల్లర్లు కొనుగోలు చేసుకోవడం లేదని పేర్కొన్నారు. ఎలాంటి షరతులు లేకుండా పత్తిని క్వింటాల్‌కు రూ.7500కు కొనుగోలు చేయాలని కోరారు.

ప్రజావాణికి ఫిర్యాదులు నిల్

చారకొండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని తహసీల్దార్ సునీత పేర్కొన్నారు. ప్రజావాణీ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

కల్వకుర్తి టౌన్: చిరుధాన్యాలతో సమతుల ఆరోగ్యం సాధ్యమని కల్వకుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి భాగ్యమ్మ అన్నారు. సోమవారం పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలు సజ్జలు, కొర్రలు, రాగులు, శనగలు, అరిగెలు, జొన్నలు, పెసర్లు, ఉలువల ప్రాధాన్యతపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు, ఎస్‌ఓ రమాదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రేషన్‌డీలర్లు సమయపాలన పాటించాలి

లింగాల: రేషన్‌డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ పాండునాయక్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దుకాణాల నిర్వహణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. దళారులకు బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలు సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీటీ పట్టాభి, ఆర్‌ఐ అనిల్‌కుమార్, తిరుపతమ్మ, డీలర్లు ఉన్నారు.

రోడ్డు నిబంధనలు ఉల్లంఘించొద్దు



పెంట్లవెల్లి: రోడ్డు నియమ నిబంధనలు ఉల్లంఘించొద్దని ఎస్‌ఐ రామన్‌గౌడ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలుకు పంపుతామని హెచ్చరించారు.

పొట్టి శ్రీరాములు పేరును మార్చొద్దు



సాక్షి, నెట్‌వర్క్: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు మార్చొద్దని కోరుతూ సోమవారం కల్వకుర్తి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అనితకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా అమ్రాబాద్ తహసీల్దార్ కిష్టన్నకు, చారకొండ తహసీల్దార్ సునీతకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పేరు మార్పులో ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, మండల సంఘం అధ్యక్షుడు గోవర్దన్, పట్టణాధ్యక్షుడు జగదీశ్వర్, కార్యదర్శి శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్, మండల కోశాధికారి మనోహర్, శేఖర్, కృష్ణయ్య, కిషన్, అమ్రాబాద్‌లో జూలూరు సత్యనారాయణ, పోల సత్యం, చారకొండలో శ్రీను, చిత్తనూరి రమేష్, నర్సింహ, అంజయ్య, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ వంట తంట



తీగలపల్లిలో వృథాగా ఉన్న వంట గది

● ఇబ్బందులు పడుతున్న వంట ఏజెన్సీలు

కోడేరు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు, విద్యార్థులకు హాజరు శాతం పెంచడం కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. మధ్యాహ్న భోజనాన్ని వండేందుకు ఏజెన్సీలకు అప్పగించింది. ఇదిలా ఉండగా వంట చేసేందుకు గదులు నిర్మించకపోవడంతో వంట చేసేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఆరు బయటే వంట చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. వర్షాకాలంలో నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట గదులు లేక పోవడంతో భోజనంతో చెత్త చెదారం పడుతోందని పలువురు విద్యార్థులు వాపోయారు. వంట సామాగ్రి దాచేందుకు ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యాశాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. కోడేరు మోడల్ స్కూల్, కొండ్రావుపల్లి హైస్కూల్, పీఎస్ పాఠశాల, ఎత్తం, మైలారం, కోడేరు సీపీఎస్, ఖానాపూర్, తదితర పాఠశాలలో వంట షెడ్డు లేక కమ్యూనిటీహాల్, అదనపు గదుల్లో వంటలు చేసే దుస్థితి దాపురించింది. కొన్ని పాఠశాలలో ప్రహరీలకు తడకలు అడ్డం పెట్టుకొని వంట చేస్తున్నారు. వంట చేసే సమయంలో పొగ పాఠశాలలలోకి వెళ్లి విద్యార్థులు రోగాలబారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వంట గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.



కోడేరు మోడల్ స్కూల్‌లో వంట చేసేందుకు వేసిన రేకులు

వంట గదులను ఏర్పాటు చేయాలి

పాఠశాలలో వంట గదులను ఏర్పాటు చేయాలి. ఆరుబయట వంట చేసేటప్పుడు గాలికి అన్నం ఉడకడం లేదు. కొన్నేళ్ల నుంచి కమ్యూనిటీ భవనంలోనే వంట చేస్తున్నాం. అధికారులు స్పందించి నూతన వంట గదులు ఏర్పాటు చేయాలి.

– లక్ష్మి, కోడేరు, వంట ఏజెన్సీ

అధికారులకు ప్రతిపాదనలు పంపించాం



మండలంలో వంట గదుల లేని పాఠశాలలను పరిశీలించాం. ఆయ పాఠశాలల్లో నిర్మాణాల కోసం నివేదికను తయారు చేసి జిల్లా అధికారులకు పంపించాం. నిధులు మంజూరు అయిన వెంటనే వంట గదులను నిర్మిస్తాం.

– భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ

ఎల్‌ఓసీ అందజేత

కోడేరు: మండలంలోని జనుంపల్లికి చెందిన బురాన్ గుండెపోటుతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2.50 లక్షలకు సంబంధించిన ఎల్‌ఓసీని సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిపాల్‌రెడ్డి అందజేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావుకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కురిసిన వర్షం

కొల్లాపూర్: పట్టణంలో మూడు రోజులుగా వర్షం కురుస్తోంది. శనివారం 11.0 మి.మీ., ఆదివారం 20 మి.మీ వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం, సాయంకాలం కొంతసేపు వర్షం పడింది. పలు చెరువులు, కుంటలలో జలకళ సంతరించుకుంది. పలు గ్రామాల్లో రోడ్లు బురదమయంగా మారాయి.

మట్టి గణపతి నిర్వాహకులకు సన్మానం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి దేవాలయం ఎదుట మట్టి గణపతిని ఏర్పాటు చేసిన నిర్వాహకులు బొగ్గులపల్లి రఘుపతి రెడ్డి, రాగుల రవీందర్‌రెడ్డిలను సోమవారం జ్ఞాన వికాస భారతి సేవా సంస్థ అధ్యక్షుడు బ్రహ్మచారి సన్మానించారు. ప్రకృతి పర్యరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేందర్, నరేందర్, రాజు, మహేశాచారి, మల్లేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

హెల్మెట్ల పంపిణీ



ఊర్కొండ: మండంలోని కాల్యతండా రాచార్లపల్లి గ్రామానికి చెందిన పాత్లావత్ అనసుజ శంకర్ నాయక్ రెండో వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు సోమవారం మండల కేంద్రంలో హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, గిరి నాయక్ ఏఎస్‌ఐ నర్సింలు, మేకల శ్రీనివాసులు ఓర్సు ఆంజనేయులు, బాలు నాయక్, లక్ష్మారెడ్డి, సందీప్ కుమార్, మోతీలాల్ నాయక్, రాజు నాయక్, వెంకట్ రెడ్డి, రవినాయక్, యువకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ

తాడూరు: మండలంలోని అల్లాపూర్, యాదిరెడ్డిపల్లి, బలాన్‌పల్లి గ్రామాలను ఎంపీడీఓ బ్రహ్మచారి ఆకస్మికంగా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో భోజనాన్ని పరిశీలించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట సిబ్బంది, తదితరులు ఉన్నారు.



పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన

తాడూరు: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో కేవీపీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగ అవకాశం కలిపించి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలన్నారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు బాలయ్య, సుబ్బయ్య, ఖైరత్, పరశురాములు, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మ మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ ఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. జీఓ నంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, యూనియర్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, వెంకటయ్య,మాసయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

బాధితులకు నష్ట పరిహారం అందజేత



బాధితులకు చెక్కులను అందజేస్తున్న సుశాంత్

మన్ననూర్: పెద్దపులి దాడిలో పశువులు మృతి చెందిన ఘటనలో బాధితులకు మన్ననూర్ రేంజ్ ఎఫ్ఆర్‌ఓ దేవజ సోమవారం నష్ట పరిహారం అందజేశారు. అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామానికి చెందిన సుగుణమ్మకు రూ. 12 వేలు, జగదీష్‌కు రూ. 14 వేలు విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌ఓ మాట్లాడుతూ అటవీ పరిసర ప్రాంతంలో పెద్దపులి దాడిలో పశువులు మృతి చెందితే వెంటనే సంబంధిత అటవీశాఖ బీట్ ఆఫీసర్‌కు తెలపాలని కోరారు. పంచానామా చేసి బాధితులకు పరిహారం అందజేస్తామన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలియజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌ఓలు బాబలి, ప్రవీణ్, బీఎఫ్ఓ ముత్యాలు, ఆనంద్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభమయ్యేనా?



పెద్దకొత్తపల్లిలో నిర్మాణం పూర్తయిన తహసీల్దార్ నూతన భవనం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో రూ.1.70 కోట్లతో నిర్మించిన తహసీల్దార్ నూతన భవనాన్ని ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం కార్యాలయం అద్దె భవనంలో ఇరుకు గదుల వల్ల అధికారులు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తయిన ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజలను దృష్టిలో ఉంచుకొని వెంటనే తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

గ్రిల్స్ ఏర్పాటు తర్వాత ప్రారంభిస్తాం



నూతన తహసీల్దార్ భవనానికి కిటికీలు, తలుపులకు గ్రిల్స్ ఏర్పాటు చేయలేదు. ఫైళ్లు, కంప్యూటర్లకు భద్రత ఉండదు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి గ్రిల్స్ ఏర్పాటు చేసిన తరువాత నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తాం.

– జేకే మోహన్, తహసీల్దార్ పెద్దకొత్తపల్లి

అటెన్షన్ ప్లీజ్



మురుగుతో ప్రజల అవస్థలు

మండల కేంద్రంలోని ప్రధాన మార్గంలో మండల పరిషత్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న మురుగు కాల్వతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కస్తూర్బా బాలికల విద్యాలయానికి మురుగు కాల్వ ఏర్పాటు చేయకపోవడంతో ప్రధానదారి పక్కనే మురుగు నిల్వ ఉంటోంది. దీంతో దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు భరించలేకపోతున్నారు. పక్కనే ఉన్న కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల బెడద, కంపువాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోయారు.

– లింగాల

సంప్రదించాల్సిన అధికారి: ఆంజనేయులు, ఎంపీడీఓ

ఫోన్ నంబర్: 7386569994

నక్షబాట కబ్జా చేశారని వినతి

వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లిలో కొందరు నక్షబాట కబ్జా చేశారని రైతులు సోమవారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బాటకు కంచె వేసి కందకాలు తీశారని రైతులు వివరించారు. 40 ఏళ్లుగా అదే బాట వెంట రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్తున్నట్లు అధికారులకు వివరించారు. పూర్తి సర్వే చేసి రైతులకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. అనంతరం ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఎస్‌ఐ కురుమూర్తిలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ రాములమ్మ, మాజీ ఉపసర్పంచ్ నర్సింహ, గ్రామస్తులు బాల్‌చెన్నయ్య, కర్ణాకర్, రామస్వామి, మల్లేష్, శివశంకర్, యాదమ్మ, శాంతమ్మ, రోషమ్మ, ప్రేమలత, యాదయ్య, అంజయ్య, అర్జున్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్ ఏఓకు...

నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురంలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కొనసాగుతున్న టన్నెల్ పనుల్లో వస్తున్న మట్టిని పెద్దవాగుకు అడ్డంగా పోయడం వల్ల వర్షం నీరు పంట పొలాల్లోకి వచ్చి నష్టం జరిగిందని సోమవారం కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్‌కు రైతులు వినతిపత్రం సమర్పించారు. అధికారులు పంటలను పరిశీలించి పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి జూపల్లి చిత్రపటానికి పాలాభిషేకం



మంత్రి జూపల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో కేఎల్‌ఐ డీ–8 కాల్వలో భూములు కోల్పోయిన రైతులకు భూ పరిహారం మంజూరు చేయించడంపై హర్షిస్తూ గ్రామ రైతులు సోమవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లురవి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ మాట్లాడారు. గ్రామానికి చెందిన 30 మంది రైతులకు చెందిన 13.14 ఎకరాల భూమి కేఎల్‌ఐ డీ–8 ఎంజే–6 కాల్వల తవ్వకంలో 2017 సంవత్సరంలో భూములు కోల్పోయారన్నారు. కార్యక్రమంలో గేరి లక్ష్మయ్య, పెద్దబాలరాజు, కొమ్ము లక్ష్మయ్య, ఆకునమోని నాగేశ్వి, రైతులు పాల్గొన్నారు.

ఆపద సమయంలో పోలీసులను ఆశ్రయించాలి

వీపనగండ్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే ధైర్యాన్ని ప్రదర్శించాలని ఎస్‌ఐ రాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. మహిళలతో దురుసుగా వ్యవహరించే వారిని చట్టపరంగా ఎదుర్కోవాలని, ఎలాంటి ఆపద సమయంలోనైనా పోలీసుల సహకారం తీసుకోవాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బిచ్చన్న, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

కొల్లాపూర్: అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చే చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై దృష్టిపెట్టాలని అంగన్‌వాడీ వర్కర్లకు సీడీపీఓ వెంకటరమణ సూచించారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్త్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే ప్రతి ఒక్కరికి పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్లు స్వాతి, జయలలిత తదితరులు ఉన్నారు.



హాజరైన అంగన్‌వాడీ వర్కర్లు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక సరస్వతి విద్యానికేతన్‌లో 2007–08 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక డీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజవర్ధన్, నారాయణరెడ్డి, లక్ష్మి, అడ్వొకేట్ నర్సింహ, రాఘవేందర్, జాకీర్, జైపాల్, ప్రభాకర్, వినయ్, లక్ష్మారెడ్డి, రజిత, హరిత పాల్గొన్నారు.

28న జాతీయ లోక్ అదాలత్

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో ఇరువర్గాల రాజీతో వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 28న నాగర్‌కర్నూల్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తునట్లు ఎస్‌ఐ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ కోసం ముందుకువచ్చే వారు సెల్: 9440170050 కు ఫోన్ చేయాలని కోరారు.

ఏడుగురిపై కేసు నమోదు

చారకొండ: మండలంలోని జూపల్లిలో గ్రామానికి చెందిన కొంత మంది రోడ్డుకు సమీపంలో జూదం(అష్టచెమ్మ) ఆడుతున్నట్లు పక్కా సమాచారంతో సోమవారం గ్రామంలో ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తనిఖీ చేపట్టారు. జూదం ఆడుతున్న ఏడుగురిని గుర్తించి పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి మంగళవారం కల్వకుర్తి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఎల్‌ఓలకు ప్రత్యేక శిక్షణ



వెల్దండ: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌ఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్తీక్‌కుమార్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ శంకర్ తదితరులు ఉన్నారు.

కార్యదర్శుల వినతి

గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి ఉన్నందున బీఎల్‌ఓలుగా ఉన్న కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో సర్పంచులు లేకపోవడంతో కార్యదర్శులకు పనిభారం పెరిగిందని వివరించారు.

మరమ్మతు చేపట్టాలని విద్యార్థుల నిరసన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరి గ్రామానికి వెళ్లే రహదారి పూర్తి దెబ్బతిందని రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరుతూ సోమవారం గ్రామ సమీపంలో బస్సును ఆపి విద్యార్థులు నిరసన తెలిపారు. రోడ్డు ధ్వంసం కావడంతో గ్రామానికి బస్సులు రావడం లేదన్నారు. రోడ్డు బాగు చేయించాలని డిమాండ్ చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు భరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

